
సాక్షి విశాఖపట్నం
సోమవారం । 10 । మార్చి । 2025



పుష్కలంగా కొమ్ముకోనం చేపలు 8లో



కూటమి ప్రభుత్వంలో ఇసుక కష్టాలు 8లో



న్యూస్‌రీల్

సిటీలో బస్సుల రూట్ మ్యాప్ విడుదల



బస్ రూట్ల మ్యాప్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు

మద్దిలపాలెం: ప్రజాప్రతినిధులు, ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు విశాఖపట్నం సిటీలో వివిధ రూట్లలో తిరుగుతున్న బస్సుల రూట్ మ్యాప్‌ను మద్దిలపాలెం డిపోలో ఆదివారం విడుదల చేశామని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. ఈ మ్యాప్‌ను విశాఖ సిటీ బస్సు స్టేషన్లోనూ ముఖ్య బస్టాప్‌ల్లో అంటించామన్నారు. అదేవిధంగా ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులు వివరాల కరపత్రాలు రిలీజ్ చేస్తున్నామన్నారు. ఎమర్జన్సీ ఫోన్ నెంబర్లు, డిపో మేనేజర్ ఫోన్ నెంబర్లు కూడా పొందుపరచడం జరిగిందన్నారు. అలాగే వేసవి తీవ్రత దృష్ట్యా బస్ స్టేషన్లలో తాగునీటి సౌకర్యం, కుర్చీలు, టాయ్‌లెట్స్ కూడా మరింత శుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులు సమయానికి చేరుకునేలా చర్యలు చేపట్టామని, బస్ స్టేషన్లలో ప్రైవేట్ వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్లు ప్రవీణ, అరుణ, ఏటీఎం రాజు చటర్జీ, గంగాధర్, సుధాకర్, పర్సనల్ ఆఫీసర్ జె తిరుపతి, సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్‌గా సలీం బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సలీం

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఆపరేషన్స్)గా డాక్టర్ జి.సలీం పురుషోత్తమన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈ బాధ్యతలు నిర్వహించిన ఎ.కె.సక్సేనా మొయిల్‌కు ఎండీగా వెళ్లడంతో ఆ పోస్టు ఖాళీ అయింది. మెకానికల్ ఇంజనీర్ అయిన సలీం 1988లో బొకారోలో మేనేజ్‌మెంట్ ట్రైనీగా తన కెరీర్‌ను ప్రారంభించారు. 1996లో విశాఖ స్టీల్ ప్లాంట్‌లో చేరారు. సర్టిఫైడ్ ఎనర్జీ మేనేజర్‌గా స్టీల్‌ప్లాంట్ ఐఎస్‌ఓ 50001 సర్టిఫికేషన్ పొందడంలో ఆయన గణనీయంగా దోహదపడ్డారు. 2018లో ఆయన బ్రెత్ వైట్ అండ్ కంపెనీ లిమిటెడ్‌లో డైరెక్టర్ (ప్రొడక్షన్)గా చేరారు. అక్కడ ఒక ఏడాది పాటు డైరెక్టర్ (ఫైనాన్స్)గా బాధ్యతలు నిర్వహించారు. మూడు నెలల పాటు అక్కడ సీఎండీగా వ్యవహరించారు. 2024లో మలేషియాలోని లింకన్ యూనివర్సిటీ నుంచి ఆయన డాక్టరేట్ పొందారు.

నేటి నుంచి యథావిధిగా పీజీఆర్‌ఎస్

మహారాణిపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) వినతుల స్వీకరణ కార్యక్రమం సోమవారం నుంచి యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. ఎన్నికల కోడ్ కారణంగా గత నెల 3వ తేదీ నుంచి పీజీఆర్‌ఎస్ రద్దయిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ఎన్నికల నియామావళిని ఎత్తివేశారు. మండల, జిల్లా స్థాయి అధికారులు పీజీఆర్‌ఎస్‌కు ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొన్నారు.

జీవీఎంసీలో...

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించనున్నట్టు మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు.

కమిషనరేట్‌లో..

అల్లిపురం: పీజీఆర్‌ఎస్ కార్యక్రమం సోమవారం నుంచి యథావిధిగా జరుగుతుందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు.

జీవీఎంసీలో గాడితప్పిన పాలన

కమిషనర్‌ను నియమించాలని నిరసన నేడు

దాబాగార్డెన్స్: జీవీఎంసీలో పాలన గాడి తప్పిందని వామపక్షాలు ఆరోపించాయి. పూర్తిస్థాయి కమిషనర్ లేక పర్యవేక్షణ లోపం కనిపిస్తోందని, ఏ అధికారి కూడా పూర్తిస్థాయిలో విధులు నిర్వహించడం లేదన్నారు. ఫైల్స్ స్తంభించాయని, పనులు పరిష్కారం కావడం లేదని వాపోయారు. రెండు నెలల కిందట జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌ను ఇక్కడి నుంచి బదిలీ చేశారని, అప్పటి నుంచి కలెక్టర్ జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఆయన జీవీఎంసీపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేకపోతున్నారన్నారు. కమిషనర్‌ను వెంటనే నియమించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలపనున్నట్లు సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, సీపీఐ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్ పేర్కొన్నారు.

అధికారులే ఆయిల్ తాగేశారు!



నెలకు అదనంగా రూ.30 లక్షల ఆయిల్ వినియోగం

అధికారులకు అధికారులే మామూళ్ల ఆఫర్

- ఫాగింగ్ యంత్రాల ఆయిల్ బిల్లు రూ.68 లక్షలకు పెంచేశారు..
- ప్రతి నెలా పబ్లిక్ హెల్త్, మెకానికల్ అధికారులకు లంచాలు
- డిప్యూటేషన్‌పై వచ్చిన ఓ అధికారికి పంపకాల బాధ్యత
- గత కమిషనర్ హయాంలో క్షేత్రస్థాయిలో పరిశీలన
- నెలకు అదనంగా రూ.30 లక్షలు కొట్టేస్తున్నారని స్పష్టం
- ఇప్పటికీ చర్యలు తీసుకోని వైనం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

సాధారణంగా ఏదైనా పనిచేసే కాంట్రాక్టర్.. అధికారులకు లంచాలు ఇవ్వడం పరిపాటి. అయితే ఘనత వహించిన జీవీఎంసీలో మాత్రం అధికారులే అధికారులకు లంచాలు ఇస్తున్నారు. తమకు ఇంత మొత్తం బిల్లు ఆయిల్ కోసం ఇస్తే.. మీకు ఇంత మొత్తం ప్రతి నెలా లంచం ముట్టచెబుతామంటూ ఆఫర్లు ఇస్తుండటం గమనార్హం. మెకానికల్ విభాగం, ప్రజారోగ్య విభాగానికి చెందిన అధికారుల మధ్య జరిగిన ఈ డీల్‌తో జీవీఎంసీకి భారీ నష్టం జరిగింది. గతంలో మెకానికల్ విభాగంలో పనిచేసిన ఓ అధికారితో పాటు జీవీఎంసీకి డిప్యూటేషన్‌పై వచ్చిన ఇద్దరు అధికారుల మధ్య లాలూచీతో వ్యవహారం సాఫీగా సాగింది. వాస్తవానికి ఫాగింగ్ యంత్రాల కోసం గతంలో రూ.38 లక్షల మేర నెలవారీగా బిల్లు ఉండగా.. దానిని ఏకంగా రూ.68 లక్షలకు పెంచేశారు. దీనిపై గత నెలలో అప్పటి కమిషనర్ ఆధ్వర్యంలో విచారణ చేయగా.. రూ.38 లక్షల మేర ఆయిల్ బిల్లు సరిపోతుందని తేలింది. తద్వారా నెలకు రూ.30 లక్షల మేర అధికంగా ఆయిల్ పేరుతో లాగేసినట్టు విచారణలో బయటపడింది. ఈ నేపథ్యంలో సదరు మెకానికల్ అధికారిపై ఈ వ్యవహారంతో పాటు ఇతర ఫిర్యాదులు రాగా బదిలీ వేటు పడింది. అయితే డిప్యూటేషన్‌పై ఉన్న మరో ఇద్దరు అధికారులకు షోకాజ్ నోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. ఈలోగా కమిషనర్ బదిలీతో ఈ వ్యవహారం మూలకు చేరింది. ఈ వ్యవహారంలో అడిగినంత మేర ఆయిల్ ఇచ్చినందుకు ప్రతిఫలంగా ఇద్దరు అధికారులకు మరో అధికారి ప్రతి నెలా రూ.2 లక్షల చొప్పున మామూళ్లు ఇచ్చినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న కలెక్టర్ ఏ చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

తనిఖీలో తేలిందిలా..

ఫాగింగ్ యంత్రాలకు ప్రతి నెలా సుమారు రూ.30 లక్షల మేర అదనపు ఆయిల్ వినియోగం జరుగుతుండటంతో, మెకానికల్ విభాగానికి కొత్తగా వచ్చిన అధికారికి అనుమానం కలిగింది. దీంతో ఆయన ఈ విషయాన్ని గత కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఆయన ఆదేశాల మేరకు ఫాగింగ్ యంత్రాలకు గంటకు ఎంత ఆయిల్ అవసరమవుతుందో ముగ్గురు అధికారులు విచారణ చేపట్టారు. వాస్తవానికి ఈ ఫాగింగ్ యంత్రాలకు గంటకు 40 నుంచి 45 లీటర్ల ఆయిల్ సరిపోతుందని విచారణలో తేలింది. అయితే గతంలో పనిచేసిన అధికారి మాత్రం ఏకంగా 120 లీటర్ల చొప్పున ఆయిల్ మంజూరు చేయడం గమనార్హం. ఫాగింగ్ పనులను పర్యవేక్షించే డిప్యూటేషన్ అధికారి, ప్రజారోగ్య విభాగంలోని ముఖ్య అధికారులు అడిగిన దాని ప్రకారమే గత అధికారి మంజూరు చేసినట్లు సమాచారం. అంతేకాకుండా ఫాగింగ్ వ్యవహారాల పర్యవేక్షణ బాధ్యత కలిగిన ఆ డిప్యూటేషన్ అధికారి మామూళ్ల వ్యవహారాలను కూడా చూస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఆ అధికారి ప్రతి నెలా మెకానికల్, ప్రజారోగ్య శాఖ అధికారులకు క్రమం తప్పకుండా మామూళ్లు అందజేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత కమిషనర్ ఫాగింగ్ వ్యవహారాల పర్యవేక్షణాధికారికి షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆదేశించినప్పటికీ, ఆయన బదిలీ, ఎన్నికల నియామవళి అమల్లోకి రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న కలెక్టరు దృష్టికి ఈ విషయం వెళ్లకుండా కొందరు జాగ్రత్తగా కాపాడే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

అడ్డగోలుగా ఆయిల్ సరఫరా

జీవీఎంసీలో ఫాగింగ్ మిషన్లు పెద్దవి 8, మీడియం సైజువి 80 ఉండగా, స్ప్రింక్లర్లు 25 ఉన్నాయి. వీటికి ప్రతి నెలా గతంలో రూ.38 లక్షల మేర ఆయిల్ బిల్లు చెల్లించేవారు. అయితే డిప్యూటేషన్‌పై వచ్చిన ఇద్దరు అధికారులు, మెకానికల్ విభాగంతో కుదుర్చుకున్న మామూళ్ల ఒప్పందంలో భాగంగా ఈ బిల్లును ఏకంగా రూ.68 లక్షలకు పెంచేశారు. ఇందుకు ప్రతిఫలంగా ఆ ఇద్దరు అధికారులకు ప్రతి నెలా రూ.2 లక్షల చొప్పున ముట్టజెప్పే విధంగా ఒప్పందం కుదిరినట్టు సమాచారం. మలేరియా (ప్రజారోగ్యం) విభాగం వారు అడిగిన మేరకే తాము ఆయిల్ కార్డులను ఇచ్చామని మెకానికల్ విభాగంలో పనిచేసిన అధికారి చెబుతున్నట్టు సమాచారం. గతానికి భిన్నంగా ఒకేసారి రెట్టింపు స్థాయిలో ఆయిల్ వినియోగం పెరిగితే కనీసం విచారణ చేయాల్సిన మెకానికల్ విభాగం అధికారి, ఎటువంటి ప్రశ్నలు వేయకుండా ఆయిల్‌ను తీసుకునేందుకు అనుమతి ఇచ్చారు. సదరు అధికారులకు అధికార పార్టీ నేతల నుంచి మద్దతు కూడా ఉండటంతో ఎవరూ తమను ఏమీ చేయలేరనే ధీమాతో అడ్డగోలుగా ఆయిల్ పంపిణీకి తెర లేపారు. ఈ వ్యవహారంలో కొందరు అధికార పార్టీ కార్పొరేటర్లకు కూడా నెలవారీగా మామూళ్లు అందినట్టు తెలుస్తోంది. రాబోయే కాలానికి కాబోయే మేయర్‌నని చెప్పుకుంటున్న నేత వద్ద ఉండే ఇద్దరు కార్పొరేటర్లకు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

క్రికెట్ బెట్టింగ్.. బుకీ అరెస్ట్

- 80 బ్యాంకు ఖాతాల నుంచి రూ.45 లక్షలు ఫ్రీజ్
- రూ.175 కోట్లు లావాదేవీలు జరిగినట్లు గుర్తించిన పోలీసులు

అల్లిపురం: నగరంలో క్రికెట్ బెట్టింగ్ జరుగుతుందన్న విశ్వసనీయ సమాచారం మేరకు, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో సిటీ టాస్క్ ఫోర్స్ సిబ్బంది, సైబర్ క్రైం పోలీసులు ఆదివారం సంయుక్తంగా దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో ప్రధాన నిందితుడు నానాబల్ల గణేశ్వరరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతను పెదవాల్తేరు డాక్టర్స్ కాలనీలోని గాయత్రి టవర్స్ సమీపంలో ఒక ఇంట్లో గుట్టుగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తుండగా పట్టుబడ్డాడు. అతనిది అల్లిపురం అచ్చియ్యమ్మపేట. పోలీసులు అతని వద్ద నుంచి ఒక ల్యాప్‌టాప్, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బెట్టింగ్ లావాదేవీల కోసం ఉపయోగిస్తున్న 80 బ్యాంకు ఖాతాల్లోని రూ.45 లక్షలను ఫ్రీజ్ చేశారు. బ్యాంకు ఖాతాల ద్వారా సుమారు రూ.175 కోట్ల లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. అదుపులోకి తీసుకున్న నిందితుడిని విచారించగా.. మరికొంత మంది బెట్టింగ్ నిర్వాహకుల గురించిన వివరాలు తెలియజేసినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. రానున్న ఐపీఎల్ సీజన్ సందర్భంగా నగర పరిధిలో ఎవరైనా బుకీలు, బెట్టింగ్ గేమ్స్ జోలికి వెళ్లినా, బెట్టింగ్ నిర్వహించినా, నిర్వహిస్తున్న వారికి సహకరించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ ఓ ప్రకటనలో హెచ్చరించారు. బెట్టింగ్ సమాచారం తెలిసినవారు 1930 లేదా సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ www. cybercrime. gov.in లో ఫిర్యాదు చేయవచ్చు. లేదా సీపీ ఫోన్ నంబర్ 79950 95799కు తెలియజేయవచ్చు.

ఉక్కు బ్లాస్ట్‌ఫర్నేస్‌లో ఉత్పత్తికి అంతరాయం

సాక్షి, విశాఖపట్నం : స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్‌కు అవసరమైన పల్వరైజ్డ్ కోల్ సరఫరా నిలిచిపోవడంతో ఆ విభాగంలో ఉత్పత్తికి అంతరాయం కలిగింది. రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్(ఆర్ఎంహెచ్‌పీ) విభాగంలోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో పల్వరైజ్డ్ కోల్ సరఫరా చేసే కన్వేయర్ బెల్ట్ కొంత మేర కాలిపోయింది. దీంతో బ్లాస్ట్‌ఫర్నేస్‌కు పల్వరైజ్డ్ కోల్ సరఫరా నిలిచిపోయి, హాట్ మెటల్ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఉన్నతాధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి బెల్ట్‌ను పునరుద్ధరించారు.

216 మందికి సామూహిక ఉపనయనాలు



సామూహిక ఉపనయనాల్లో పాల్గొన్న వటువులు

సింహాచలం: అడవివరంలో ఉచిత సామూహిక ఉపనయనాల కార్యక్రమం ఘనంగా జరిగింది. విశాఖ జిల్లా కళింగ వైశ్య యువజన చైతన్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 216 మంది శైవ, వైష్ణవ వటువులకి ఉపనయనాలు చేశారు. తొలుత వటువులందరినీ కొండదిగువ సింహాచలం దేవస్థానానికి చెందిన వరాహ పుష్కరిణిలో స్నానాలు ఆచరింపజేశారు. అక్కడి నుంచి వారందరినీ ఊరేగింపుగా సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న శ్రీనివాస కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. 216 మందిని వరసగా కూర్చోబెట్టి శాస్త్రోక్తంగా యజ్ఞోపవీత ధారణచేశారు. వటువులందరిచేత గాయత్రీ మంత్రాన్ని పఠింపజేశారు. భిక్షాటన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు తాళాసు సాయిమోహన్ మాట్లాడుతూ నేటి యువతకు మన సంప్రదాయాలు, కట్టుబాట్లను గుర్తు చేసేందుకే పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వెల్లడించారు. సంఘం కోశాధికారి బోయిన భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

అనంతుని కల్యాణోత్సవాలకు అంకురార్పణ



పూజలు చేస్తున్న వేద పండితులు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో వారం రోజులపాటు నిర్వహించనున్న అనంత పద్మనాభ స్వామి కల్యాణోత్సవాలకు ఆదివారం రాత్రి పుట్ట బంగారం తీసుకురావడంతో అంకురార్పణ జరిగింది. ముందుగా కుంతీ మాధవ స్వామి ఆలయంలోని చక్ర పెరుమాళ్లను పల్లకీలో ఊరేగింపుగా పాత సంత నిర్వహించే స్థలం వద్దకు తోడ్కొని వచ్చారు. ఇక్కడ తీర్చిదిద్దిన మేదిన మాత రూపం వద్ద విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మేదిని పూజ నిర్వహించారు. అనంతరం ఇక్కడ నుంచి పుట్ట బంగారాన్ని కుంతీ మాధవస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న యాగశాలలోకి తీసుకు వెళ్లి 12 పాళిక(ప్రమిదలు)ల్లో వేశారు. పాళికల్లోని పుట్టబంగారంలో నవధాన్యాలు వేసి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సోమవారం రాత్రి జరిగే స్వామి కల్యాణానికి ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు.

అక్రమ తొలగింపులు ఆపకపోతే నిరవధిక సమ్మెకు సిద్ధం



- స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘాల హెచ్చరిక
- కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిరసిస్తూ గాజువాకలో మహాధర్నా



ధర్నాలో ప్రసంగిస్తున్న దేవన్‌రెడ్డి (ఇన్‌సెట్) ప్లకార్డు ప్రదర్శిస్తున్న కార్మికుడు

గాజువాక : స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులను అక్రమంగా తొలగిస్తున్నారని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. అక్రమ తొలగింపులను ఆపకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిరసిస్తూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పాతగాజువాకలో ఆదివారం మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు మోదీ ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నాలను ముమ్మరం చేసిందన్నారు. అందులో భాగంగా ప్రైవేట్ పెట్టుబడిదారులు కోరినట్టుగా ఇక్కడి కార్మికుల సంఖ్యను తగ్గిస్తోందన్నారు. దీన్ని ప్రశ్నిస్తున్న నాయకులకు యాజమాన్యం షోకాజ్ నోటీసులను జారీ చేయడం దుర్మార్గమన్నారు. వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేసేందుకు సీఎం చంద్రబాబు సుముఖంగా ఉన్నట్టు ఆయన ప్రకటనలు స్పష్టం చేస్తున్నాయన్నారు. ప్లాంట్‌లో 10 వేల మందిని నాలుగు దశల్లో తొలగించే విధంగా కుట్ర చేశారన్నారు. ఢిల్లీలో గతంలో నిర్వహించిన రైతు పోరాటం మాదిరిగా త్వరలో విశాఖ ఉక్కు కార్మికులు కూడా ఉద్యమించడం ఖాయమన్నారు. వివిధ సంఘాల నాయకులు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, ఎన్.రామారావు, జె.అయోధ్యరామ్, పులి రమణారెడ్డి, డి.వి.రమణ, జి.శ్రీనివాసరావు, నమ్మి రమణ, మంత్రి రవి, కె.వంశీ, కసిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ పర్యవేక్షణ

అఖిలపక్ష కార్మిక సంఘాల ధర్నాను స్వయంగా గాజువాక రెవెన్యూ అధికారులు పర్యవేక్షించడం చర్చనీయాంశమైంది. ఈ మహాధర్నాకు పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. వారితోపాటు గాజువాక తహసీల్దార్ టి.శ్రీవల్లి నేతృత్వంలో ఆర్‌ఐలు, సిబ్బంది ధర్నా వద్దే ఉండి పరిస్థితిని సమీక్షించారు. రెవెన్యూ అధికారులు దగ్గరుండి సమీక్షించడం పట్ల కార్మికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ప్లాట్‌ఫాంపైకి అంత వీజీ కాదు



- రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ నియంత్రణకు కొత్త వ్యూహాలు
- కన్‌ఫర్మ్ టికెట్స్ ఉంటేనే ప్లాట్‌ఫాంపైకి అనుమతి
- వెయిటింగ్ లిస్ట్ ఉంటే స్టేషన్ బయట ఉన్న హాల్‌లోనే..
- త్వరలో విశాఖ రైల్వే స్టేషన్‌లో అమలుకు సన్నాహాలు

విశాఖ రైల్వేస్టేషన్ సమాచారం		
స్టేషన్ కేటగిరీ: నాన్ సబర్బన్ గ్రూప్ (ఎన్ఎస్‌జీ)1	ఏటా ప్రయాణికుల రాకపోకల ద్వారా ఆదాయం సుమారు రూ.560 కోట్లు	ప్లాట్‌ఫాంలు 8
	ఏటా రాకపోకలు సాగించే ప్రయాణికులు సుమారు 2 కోట్లు	స్టేషన్‌లో మొత్తం ట్రాక్‌లు 10
		రైల్వే స్టేషన్ విస్తీర్ణం 1,110,600 చ.అడుగులు

సాక్షి, విశాఖపట్నం: నేను టికెట్ తీసుకున్నాను. వెయిటింగ్‌లో ఉంది. ట్రైన్ ఎక్కిన తర్వాత ఎలాగైనా కన్‌ఫర్మ్ చేయించుకుని బెర్త్‌లో హాయిగా పడుకుంటానని అనుకుంటే.. ఆ పప్పులింక ఉడకవ్. ఎందుకంటే టికెట్ కన్‌ఫర్మ్ అయితేనే ప్లాట్‌ఫాంపైకి వెళ్లేందుకు అనుమతి ఉంటుంది. లేదంటే కన్‌ఫర్మ్ టికెట్ ఉన్నవాళ్లు వెళ్లిన తర్వాత.. మీ టర్న్ వచ్చినప్పుడు మాత్రమే ట్రైన్ ఎక్కగలరు. ఇటీవల ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో 18 మంది మరణించిన దురదృష్టకర ఘటన నేపథ్యంలో, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అధ్యక్షతన ఒక అత్యున్నత సమావేశం జరిగింది. ప్లాట్‌ఫాంలపై ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలువురు నిపుణులు సూచనలు చేశారు. అనంతరం అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలను అమలు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్లాట్‌ఫాంలపైకి ఒకేసారి ప్రయాణికులు గుంపులుగా రాకుండా నిరోధించడానికి అవసరమైన చర్యలను దేశవ్యాప్తంగా 60 ప్రధాన స్టేషన్లలో అమలు చేయాలని నిర్ణయించారు.

పైలట్ ప్రాజెక్టు కింద న్యూఢిల్లీ, ఆనంద్ విహార్, వారణాసి, అయోధ్య, పాట్నా స్టేషన్లలో ఈ నిబంధనలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. రైలు వచ్చిన తర్వాత, ప్రయాణికులను ఒకరి తర్వాత ఒకరిగా, వివిధ మార్గాల ద్వారా రైలు దగ్గరకు అనుమతిస్తున్నారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో కూడా ఈ తరహా నిబంధనలు అమలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఏం చేస్తారంటే.?

- ప్లాట్‌ఫాంపై రద్దీని నియంత్రించేందుకు ఇకపై వెయిటింగ్ ప్రాంతాలను స్టేషన్ బయట ఏర్పాటు చేస్తారు. టికెట్ లేని ప్రయాణికులు కూడా స్టేషన్ వెలుపలే వేచి ఉండాలి. వెయిటింగ్ లిస్ట్‌లోని ప్రయాణికులను పంపిన తర్వాత, వారికి రైలు ఎక్కేందుకు అనుమతి లభిస్తుంది.
- ముందుగా కన్ఫర్మ్ రిజర్వేషన్ టికెట్ ఉన్న ప్రయాణికులను మాత్రమే ప్లాట్‌ఫాంపైకి అనుమతిస్తారు.
- మరోవైపు స్టేషన్లలో మరింత వెడల్పుగా ఉండే ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను(వంతెనలు) నిర్మించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. మహాకుంభమేళా సమయంలో ఇలాంటి వెడల్పాటి వంతెనలు సమర్థవంతంగా పనిచేశాయి. ఈ నేపథ్యంలోనే స్టేషన్లలో 6 మీటర్లు, 12 మీటర్ల వెడల్పు కలిగిన ఎఫ్‌వోబీలు రాబోతున్నాయి.
- రైల్వేస్టేషన్లలో రద్దీని ఎప్పటికప్పుడు గమనించేందుకు సీసీ టీవీ నిఘాను మరింత పటిష్టం చేయనున్నారు. రైల్వేస్టేషన్ల పరిసర ప్రాంతాల్లో కూడా నిఘా ఏర్పాటు చేస్తారు.
- సమన్వయాన్ని మెరుగుపరచడానికి సిబ్బందికి వాకీ టాకీలు, అత్యాధునిక అనౌన్స్‌మెంట్ సిస్టమ్, కాలింగ్ సిస్టమ్‌లతో సహా ఆధునిక డిజిటల్ కమ్యూనికేషన్ వ్యవస్థలను అందుబాటులోకి తీసుకొస్తారు.
- సంక్రాంతి, దసరా వంటి పండగలు, సెలవుల సమయాల్లో రైల్వే స్టేషన్లలో వార్ రూమ్‌లను ఏర్పాటు చేస్తారు. స్టేషన్ పరిధిలోని అన్ని విభాగాల సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ, రద్దీని నియంత్రించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించి అమలు చేస్తారు.
- ప్రధాన స్టేషన్లలో ఆర్థికపరమైన విషయాలపై తక్షణమే నిర్ణయాలు తీసుకునే అధికారం కలిగిన స్టేషన్ డైరెక్టర్‌ను నియమించనున్నారు. ఈ అధికారి స్టేషన్ సామర్థ్యం, రైలు లభ్యతను బట్టి టికెట్లను ఎంత వరకు విక్రయించాలనే విషయాలను నిర్ణయిస్తారు.
- ఈ ప్రాజెక్ట్ అమల్లోకి వచ్చిన తర్వాత రైల్వేస్టేషన్ ప్రవేశంపై రైల్వే శాఖ పూర్తి నియంత్రణ కలిగి ఉంటుంది. స్టేషన్‌కు చేరుకోవడానికి ఉన్న అన్ని అనధికారిక ప్రవేశ మార్గాలను మూసివేస్తారు.
- విశాఖపట్నం ఇటీవలే 'ఏ'గ్రేడ్ స్టేషన్‌గా గుర్తింపు పొందిన నేపథ్యంలో, ఈ తరహా నిబంధనలను ఇక్కడ కూడా అమలు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని రైల్వే అధికారులు చెబుతున్నారు. స్టేషన్‌కు అధికారికంగా, అనధికారికంగా ఎన్ని ప్రవేశ ద్వారాలు ఉన్నాయి? నిష్క్రమణ మార్గాలు ఎన్ని ఉన్నాయి? రోజువారీ రైళ్ల రాకపోకలు, ప్రయాణికుల వివరాలతో కూడిన సమగ్ర నివేదికను అందజేయాలని రైల్వే బోర్డు ఆదేశించినట్లు సమాచారం.

పుష్కలంగా కొమ్ముకోనం చేపలు





మత్స్యకారులకు అదృష్టం వరించింది. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారుల వలలో ఊహించని రీతిలో కొమ్ముకోనం చేపలు చిక్కాయి. కొంతకాలంగా వేట సవ్యంగా సాగక సతమతమవుతున్న మత్స్యకారులకు ఈ భారీ చేపల వేట ఊరటనిచ్చింది. ముఖ్యంగా కొమ్ముకోనం చేపలు వందల సంఖ్యలో లభించడంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు. వీరి వలలో దాదాపు 90 కిలోల బరువున్న ఒక భారీ కొమ్ముకోనం చేప కూడా చిక్కింది. అంతేకాకుండా 20 కిలోల నుంచి 90 కిలోల వరకు బరువున్న కొమ్ముకోనం చేపలు లభ్యమయ్యాయి. అయితే ఈ చేపలను ఒడ్డుకు చేర్చడం మత్స్యకారులకు ఒక సవాలుగా మారింది. భారీ బరువుతో ఉన్న చేపలను వల నుంచి బోటులోకి, బోటు నుంచి జెట్టికి చేర్చడానికి చాలా కష్టపడ్డారు. తాళ్లు కట్టి ఈ చేపలను జెట్టిపైకి లాగారు. ఇలా ఎన్నో వ్యయప్రయాసల తర్వాత చేపలు ఫిషింగ్ హార్బర్‌కు చేరాయి. పెద్ద చేపలు ఉండడంతో వాటిని ముక్కలుగా కూడా కట్ చేశారు. మార్కెట్‌లో కొమ్ముకోనం చేపలకు మంచి గిరాకీ ఉంది. ముఖ్యంగా కేరళలో ఈ చేపలకు విశేష ఆదరణ ఉంది. ఈ చేపలను వ్యాన్‌లు, కంటైనర్‌లలో ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయడానికి సిద్ధం చేశారు. – మహారాణిపేట/ ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం





రూమ్ నంబరు 229లో ఏమి జరిగింది?

- హోటల్ సిబ్బందిని విచారిస్తున్న పోలీసులు
- కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్న మూడో పట్టణ పోలీసులు

బీచ్‌రోడ్డు : ఎస్‌ఆర్‌ఐ మహిళ రోజా అనుమానాస్పద మృతిపై మూడో పట్టణ పోలీసులు విచారణ ప్రారంభించారు. హోటల్ సిబ్బందిని ఆదివారం పిలిపించి ఈ సంఘటన జరిగిన 6వ తేదీన మేఘాలయ హోటల్ రూమ్ నంబరు 229లో ఏమి జరిగిందోనని వివరాలు సేకరించారు. రోజా ఆమె స్నేహితుడు పిల్లా శ్రీధర్ ఎప్పుడు హోటల్‌కు వచ్చారు? వారికోసం ఎవరైనా వచ్చారా? హోటల్ సిబ్బందితో ఎలా ప్రవర్తించేవారు? తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమికంగా ఆత్మహత్యగా పోలీసులు నిర్ధారిస్తున్నప్పటికీ.. పోస్టుమార్టం రిపోర్టు వస్తే కాని ఏమి చెప్పలేని పరిస్థితి నెలకొంది.

కేసు నీరుగార్చే ప్రయత్నం?

ఈ కేసును మొదటి నుంచి కప్పిపుచ్చేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. సంఘటన జరిగిన రోజు సాయంత్రం మేఘాలయ హోటల్ మేనేజర్ ఫిర్యాదు చేస్తే కనీసం ఏమి జరగనట్లు మూడో పట్టణ పోలీసులు వ్యవహరించారు. చివరికి మీడియా ప్రతినిధులు పోలీసులను సంప్రదించినా అటువంటిది ఏమి లేదని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. అయితే మీడియాలో పెద్ద ఎత్తున కథనాలు రావడంతో పోలీసులు విచారణ షురూ చేశారు. కానీ ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన అంశాలను పరిశీలిస్తే కేసును నీరుగార్చే విధంగా ఉంది.

కేసులో నిందితులు ఎవరు లేరు?

మూడో పట్టణ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో అసలు నిందితులు ఎవరు లేరని పేర్కొన్నారు. హోటల్ మేనేజర్ తన ఫిర్యాదులో రోజా మృతి పట్ల అనుమానంగా ఉందని తెలిపారు. తొలుత డాక్టర్ శ్రీధర్ అనే వ్యక్తి హోటల్ రూమ్ నుంచి బయటకి వచ్చి రూమ్ డోర్ అనుకోకుండా లాక్ అయిందని చెప్పారని, రూమ్ దగ్గరకి వెళ్లేసరికే తన స్నేహితురాలు అపస్మారక స్థితిలో ఉందని చెప్పారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయినా సరే శ్రీధర్‌ను నిందితుడిగా చేర్చకుండా పోలీసులు విచారణ చేయడంపై పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.

ఫిర్యాదులోనూ లొసుగులు?

నిజానికి మేఘాలయ హోటల్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదులో కూడా చాలా లొసుగులు ఉన్నాయి. డాక్టర్ శ్రీధర్ 6వ తేదీ మధ్యాహ్నం 1.15 గంటలకు హోటల్‌కు వచ్చినట్లు.. 1.40 గంటలకు రోజా నేరుగా హోటల్ రూమ్ నంబర్ 229కి వెళ్లినట్లు పేర్కొన్నారు. 3.35 గంటలకు శ్రీధర్ రూమ్ నుంచి బయటకి వచ్చి హోటల్ సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. రెండు గంటల పాటు రోజా, శ్రీధర్ మాత్రమే రూమ్‌లో ఉన్నట్లు తెలుస్తుంది. రూమ్‌లో శ్రీధర్ ఉండగా రోజా బాత్‌రూమ్‌లో ఆత్మహత్య చేసుకుందా..? అసలు హుక్ గానీ, కిటికీ గాని లేని బాత్‌రూమ్‌లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకునే అవకాశం ఉంటుందా..? హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారా? ఇలా అనేక సందేహాలు ఈ కేసు చుట్టూ తిరుగుతున్నాయి.

బాలికపై అత్యాచారం?

తగరపువలస : సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో చికిత్సకు వచ్చిన మానసిక వికలాంగురాలైన బాలికపై శనివారం రాత్రి అత్యాచారం జరిగిన ఘటనతో ఈ ప్రాంతంలో తీవ్ర కలకలం రేగింది. బాధితురాలితో పాటు అత్యాచార ఘటనకు పాల్పడిన నిందితుడు(35) ఒడిశాలోని మల్కన్‌గిరి ప్రాంతం కావడం గమనార్హం. సంఘటన శనివారం రాత్రి 9 నుంచి 10 గంటల మధ్య జరిగినా ఆస్పత్రి సిబ్బంది ఆదివారం వరకు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం. సంఘటన జరిగిన తర్వాత నిందితుడిని ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద సెక్యూరిటీ గదిలో ఉంచారు. అత్యాచారానికి గురైన బాలిక ఆదివారం ఉదయం వరకు రక్తస్రావంతో బాధపడుతున్నట్టు తెలిసింది. అత్యాచార సమాచారం అందుకున్న మీడియా ఆస్పత్రి వద్ద ఆరా తీయడంతో భీమిలి పోలీసులు రంగప్రవేశం చేశారు. పోలీసులు ఆస్పత్రిలోకి రాక ముందే బాధితురాలి కుటుంబ సభ్యులతో ఆస్పత్రి యాజమాన్యం చర్చలు జరిపి రాజీకి వచ్చినట్టు తెలిసింది. తరువాత మధురవాడ జోన్ ఏసీపీ అప్పలరాజు ఆస్పత్రి వద్దకు చేరుకుని విచారణ ప్రారంభించారు. ఇదిలా ఉండగా మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఆస్పత్రి సిబ్బంది మీడియాను ఏమార్చి నిందితుడిని ఆటోలో జాతీయరహదారి వరకు తరలించి అక్కడ నుంచి ఒడిశాకు పంపించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాలికపై అత్యాచారం జరిగినట్టు ఆధారాలు లేదా వారి కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు ఉంటే తప్ప ఏమీ చేయలేమని పోలీసులు చేతులెత్తేశారు. ఇదిలా ఉండగా నిందితుడు బాధితురాలిని మూడో ఫ్లోర్ నుంచి ఆరో ఫ్లోర్‌కు తీసుకువెళ్లినట్టు తెలిసింది. సంఘటన జరిగినా పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంతో మరిన్ని అనుమానాలకు తావిస్తోంది.

- సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి యాజమాన్యం తరచూ విశాఖ, విజయనగరం, ఒడిశాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం కోసం ఇక్కడకు తీసుకొస్తుంటారు. ప్రస్తుతం అత్యాచార బాధితురాలు, నిందితుడు ఇదే విధంగా చికిత్స కోసం మల్కన్‌గిరి నుంచి వచ్చారు.



సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి

అత్యాచారయత్నమే జరిగింది..

ఆస్పత్రి సిబ్బంది మీడియాతో మాట్లాడుతూ మల్కన్‌గిరి నుంచి వచ్చిన 25 మందికి చికిత్స తరువాత శనివారం డిశ్చార్జ్ చేశామన్నారు. చీకటి పడటంతో ఆదివారం పంపించడానికి గానూ వారిని ఆరో ఫ్లోర్‌లో ఉంచామన్నారు. బాధితురాలు వాష్ రూమ్‌లోకి వెళ్లగా నిందితుడు ఆమె వెంట వెనకే వెళ్లాడన్నారు. ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో మిగిలిన వారు అతనికి దేహశుద్ధి చేసి తమకు అప్పగించారన్నారు.

పాపాహోం నుంచి శాటిలైట్ సెంటర్‌కు..

- తల్లిదండ్రులు లేకున్నా విజయపథానికి
- మొక్కవోని దీక్షతో కలల సాకారానికి ప్రయత్నిస్తున్న భట్టిపాటి ప్రియాంక

సీతమ్మధార: తల్లిదండ్రులు విడిపోయారు. దీంతో ఆ బాలిక భవిష్యత్ అంధకారంలో పడిపోతుందనుకున్నారు. అమ్మమ్మ అన్నీ అయి చదివించారు. సీతమ్మధార పాపాహోంలో ఉంటూ చదువుకున్న ఆమె ప్రస్తుతం ఉన్నతోద్యోగం చేయడం విశేషం. దీంతో త్వరలోనే పాపాహోం ఆవరణలో ఆమెకి ఘనంగా సత్కారం చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ యువతి విజయగాథ మనమూ తెలుసుకుందాం. గూడూరుకు చెందిన భట్టిపాటి ప్రియాంక (21) విశాఖ జిల్లా తగరపువలసలో మేనమామ వద్ద ఉంటూ చదువుకునేది. 9వ తరగతి చదివే సమయంలో 2017లో పాపాహోంలో చేరింది. సీతమ్మధారలోని డాల్ఫిన్ స్కూల్లో 9, పది చదివింది. ఈమెకి తల్లి లేరు. తండ్రి రెండో వివాహం చేసుకున్నారు. ప్రియాంక డిప్లమో ఇన్ కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ (డీసీసీ) పూర్తి చేసింది. తర్వాత


రాకెట్ లాంచింగ్ ఉద్యోగమే ఇష్టమంటున్న ప్రియాంక

నెల్లూరు జిల్లాలో డీకేడబ్ల్యూ కళాశాలలో బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్ బ్రాంచ్‌లో (సీఏ)లో చేరింది. భీమునిపట్నం పాలిటెక్నిక్ కళాశాలలో పాపాహోం ఆర్థిక సాయంతోనే డిప్లమో చదివింది. ఈ కళాశాల నుంచి విద్యార్థుల వివరాలు పంపడంతో శ్రీహరికోటలోని స్పేస్ సెంటర్‌లో ఏడాది పాటు అప్రెంటిస్ శిక్షణకు ఎంపికై శిక్షణ తీసుకుంది. గత ఏడాది అక్టోబర్‌లో ఈ శిక్షణ పూర్తి అయింది. ఉద్యోగ ప్రయత్నాల్లో భాగంగా బెంగళూరులోని కేంద్ర ప్రభుత్వానికి చెందిన యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో అకౌంట్స్‌లో సీహెచ్‌ఎస్‌ఎస్ పోస్టులో కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తోంది. ప్రస్తుతం ఆమెకి రూ.22 వేల వేతనం అందుతోంది.

రాకెట్ లాంచింగ్ ఉద్యోగమే లక్ష్యం..

నేను 2003లో గూడూరులో పుట్టాను. 2008లో నా తల్లిదండ్రులు విడిపోయారు. గూడూరులోని అమ్మమ్మ వద్దే పెరిగాను. విశాఖలోని పాపాహోంలో ఉంటూ డాల్ఫిన్ స్కూల్లో 9వ తరగతిలో చేరాను. అక్కడే పదో తరగతి పూర్తి చేశాను. భీమిలిలో డిప్లమో చేశాను. 2018లో తల్లి ఇంట్లోంచి వెళ్లిపోయారు. ఎక్కడున్నారో తెలియదు. రాకెట్ లాంచింగ్ సెంటర్‌లో ఉద్యోగమే ధ్యేయంగా పని చేస్తున్నాను. గూడురులో అమ్మమ్మ బాగోగులు నేనే చూస్తున్నాను.

– ప్రియాంక, బెంగళూరు.

మనస్తాపంతో యువతి ఆత్మహత్య

- వచ్చే నెలలో వివాహం నిశ్చయం

సీతమ్మధార: తనకు ఇష్టం లేని వివాహం చేస్తున్నారని ద్వారకానగర్‌లో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తండ్రి రామానాయుడు ద్వారకానగర్‌లోని కామత్ హోటల్లో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. ఐదేళ్ల క్రితం ఒడిశా నుంచి ఉపాధి కోసం కుటుంబంతో విశాఖపట్నం వచ్చాడు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. ఇద్దరికి వివాహం చేశాడు. చిన్న కుమార్తె ప్రమీల (20)కు కుటుంబ సభ్యులు పెళ్లి నిశ్చయించారు. ఫిబ్రవరిలో నిశ్చితార్థం జరిపి ఏప్రిల్‌లో ముహూర్తం పెట్టుకున్నారు. నచ్చని వివాహం చేస్తున్నారనే మనస్తాపంతో ఆమె ఆత్మహత్య చేసుకోవాలని నిశ్చయించుకుంది. ఆదివారం మాంసం తీసుకురా అని తండ్రికి రూ.ఐదు వందలు ఇచ్చి పంపించింది. అతను బజారుకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే సరికి ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కిటికీలో నుంచి చూసే సరికి ఉరి వేసుకుని విగత జీవిగా కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి మృతదేహన్ని కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా మృతురాలి సెల్‌ఫోన్ కనిపించకపోవడం విశేషం. పోలీసులు దాని కోసం ఆరా తీస్తున్నారు.


మృతురాలు ప్రమీల

హిందువులపై దాడిని పవన్ కల్యాణ్ ఖండించాలి


సమావేశంలో మాట్లాడుతున్న వాసు

- జన జాగరణ సమితి డిమాండ్

డాబాగార్డెన్స్: అన్నమయ్య జిల్లా రాయచోటిలో వీరభద్రస్వామి ఊరేగింపులో హిందువులపై ముస్లిం మతోన్మాదులు, పోలీసుల దాడిని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఖండించాలని జన జాగరణ సమితి డిమాండ్ చేసింది. ఆదివారం డాబాగార్డెన్స్‌లోని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో సమితి రాష్ట్ర కన్వీనర్ ఎస్‌ఎల్‌ఎన్ వాసు మాట్లాడుతూ వీరభద్రస్వామి ఊరేగింపు మసీదు వద్దకు రాగానే విచక్షణారహితంగా కొంత మంది ముస్లిం మతోన్మాదులు రెచ్చిపోయి హిందువులపై భౌతిక దాడి చేశారని ఆరోపించారు. ఆ ముస్లిం మతోన్మాదులను నిలువరించాల్సిన పోలీసులు కూడా హిందువులపై లాఠీచార్జి చేసి మహిళలను కాళ్లతో తన్నుతూ, బండ బూతులు తిడుతూ అత్యంత హేయమైన చర్యలకు పాల్పడ్డారన్నారు. ఈ ఘటనను పవన్ కల్యాణ్ తీవ్రంగా ఖండించాలని డిమాండ్ చేశారు. ఈ ఊరేగింపులో జై శ్రీరామ్ నినాదాలు చేయడం వల్ల 16 మంది హిందువులను జైల్లో పెట్టారని, ఆంధ్రప్రదేశ్‌లో జై శ్రీరామ్ నినాదాన్ని ఏమైనా నిషేధించారా? ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. రాయచోటికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి హిందువులపై దాడిని ఎందుకు ఖండించలేదని నిలదీశారు. హిందూ సంస్థల నాయకులపై దౌర్జన్యానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకుంటే కూటమి ప్రభుత్వం తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో సమితి నగర కన్వీనర్ చింతపల్లి సునీల్‌కుమార్, దేవర శంకర్, భార్గవ్‌రెడ్డి, వెంకటశ్యామ్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే ఇసుక కష్టాలు

- జిల్లా క్వారీ లారీ యజమానుల సంఘం
- అధికలోడుతో వెళ్తున్న 12 లారీల అడ్డగింత

తగరపువలస: శ్రీకాకుళం ఇసుక రీచ్‌ల నుంచి అధిక లోడు, ఫేక్ బిల్లులతో విశాఖ వైపు రవాణా అవుతున్న 12 ఇసుక లారీలను విశాఖ, ఆనందపురం, మధురవాడ తదితర ప్రాంతాలకు చెందిన లారీ యజమానులు శనివారం అర్ధరాత్రి ఆనందపురం వద్ద అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆదివారం ఉదయం పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా క్వారీ లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు మద్దిల వెంకటరమణ తదితరులు మాట్లాడారు. సాలూరు, రాజమండ్రి, విజయవాడకు చెందిన 25 టన్నుల సామర్థ్యం కలిగిన లారీల్లో 50 టన్నుల వరకు ఇసుక రవాణా చేస్తున్నారని ఆరోపించారు. ఇదేమని అడిగితే సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేష్, పవన్ కల్యాణ్ పేర్లు చెప్పి తప్పించుకుంటున్నారన్నారు. రణస్థలం వద్ద చెక్ పోస్టులు ఉన్నా ఫేక్ బిల్లులు, అధిక లోడుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. రోజుకు ఒక్క లోడు రవాణా చేయవలసి ఉండగా రెండు నుంచి మూడు లోడులు చేస్తున్నారన్నారు. దీనిపై సోమవారం శ్రీకాకుళం కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అదే విశాఖ జిల్లాకు చెందిన లారీ యజమానులు అదనపు లోడుతో పట్టుబడితే జరిమానాలు, గ్రీన్ టాక్స్, అదనపు లోడు పేరుతో రూ.70వేల వరకు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని టన్నుల సామర్థ్యం కలిగిన లారీల్లో అంతే లోడు రవాణా చేయాలన్నారు. ఒకవేళ సామర్థ్యాన్ని మించి రవాణా చేస్తే జరిగే ప్రమాదాలకు బీమా వర్తించదన్నారు. రీచ్‌ల వద్ద సీనరేజ్ పేరుతో టన్నుకు రూ.99 కాకుండా అదనంగా రూ.300 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో వేధింపుల కారణంగానే జిల్లాలో ఇసుక రవాణా లారీ యజమానుల సంఖ్య వెయ్యి నుంచి 250కి తగ్గిపోయిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జేపీ వెంచర్స్ ద్వారా ఇసుక పంపిణీ చేసినా ఇలాంటి ఇబ్బందులు లేవన్నారు. కూటమి ప్రభుత్వం చెబుతున్న ఉచిత ఇసుక విధానం ద్వారా భవన నిర్మాణదారులకు నష్టమే మిగులుతోందన్నారు. ప్రభుత్వం భీమిలి, ఆనందపురం వద్ద ఇసుక డిపోలు పెట్టి టన్ను రూ.700కే ఇసుక అందిస్తే.. రవాణా కలుపుకుని తాము జిల్లాలో రూ.900 నుంచి రూ.1000కే ఇసుక సరఫరా చేస్తామన్నారు. నిరసనలో లారీ యజమానుల సంఘాల ప్రతినిధులు బొట్ట సురేష్, మద్దిల శ్రీనివాసరావు, బంక శ్రీను, కోరాడ శ్రీను, బోడసింగు రాంబాబు, కొయ్య శ్రీనివాసరెడ్డి, నమ్మి మాధవరావు, కర్రి రమణ, గురునాయుడు, గిరి, శివ, రామకృష్ణ, తుపాకుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.


ఆనందపురం పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న లారీ యాజమానులు

మహిళలు.. మహారాణులే..

- హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత

మహారాణిపేట: మహిళలు మహారాణులే అని.. అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్నారని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా నర్సులతో కలిసి హోం మంత్రి కేక్ కట్ చేసి మాట్లాడారు. ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. ఆడపిల్లలతో పాటు మగ పిల్లలను కూడా భద్రతగా, బాధ్యతగా పెంచాలన్నారు. నర్సుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. కేజీహెచ్‌లో ప్రతీ వార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం రోగులకు ఉత్తమ సేవలందించిన పలువురు నర్సులు, ఏఎంసీ ప్రిన్సిపాల్ సంధ్యాదేవిని ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఎన్టీఆర్ వైద్యసేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవీలత, నర్సుల అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షురాలు టి.గంగాభవాని, కార్యదర్శి జీవీఎస్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఏఎంసీ ప్రిన్సిపాల్ సంధ్యాదేవిని సన్మానిస్తున్న రాష్ట్ర హోం మంత్రి అనిత

ఇది హిందూ ధర్మంపై దాడే..

- మూత్రం పోయరాదు అనే బోర్డుపై అమ్మవారి ఫొటో
- ఆగ్రహం వ్యక్తం చేసిన జన జాగరణ సమితి

బీచ్‌రోడ్డు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో ఏదో ఒక ప్రాంతంలో హిందూ ధర్మంపై దాడులు జరుగుతున్నాయని జన జాగరణ సమితి నగర కన్వీనర్ చింతపల్లి సునీల్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవీఎంసీ 28వ వార్డు రామ్ నగర్ వద్ద గల లైఫ్ స్టైల్ షాపింగ్ మాల్ ఎదురుగా గోడలపై అతికించిన మూత్రం పోయరాదు అనే హెచ్చరిక బోర్డుపై అమ్మవారి ఫొటో ముద్రించడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్చరిక బోర్డులపై అమ్మవారి ఫొటోలను ఎలా ముద్రిస్తారని జీవీఎంసీని ప్రశ్నించారు. ఇటువంటి నీచ సంప్రదాయానికి ఒడిగట్టిన జీవీఎంసీ 28వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హిందూ ధర్మంపై దాడులను అరికట్టకపోతే భవిష్యత్‌లో కూటమి ప్రభుత్వం తీవ్ర పరిణామాలను ఎదుర్కొంటుందని ఆయన హెచ్చరించారు.



హెచ్చరిక బోర్డుపై ముద్రించిన అమ్మవారి ఫొటో

జలకాలాటలలో..

నగరంలో ఎండ తీవ్రత పెరిగింది. ఈ వేడి నుంచి ఉపశమనం పొందడానికి మత్స్యకార యువకులు, బాలలు ఆదివారం సాయంత్రం విశాఖ సాగర తీరంలో సందడి చేశారు. సముద్రపు నీటిలో గంతులు వేస్తూ.. ఈదుతూ, ఒకరిపై ఒకరు నీళ్లు చల్లుకుంటూ జలకాలాడారు. ఈ ఉల్లాసమైన దృశ్యాలను 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది.





చెరువులో పడి యువకుడి మృతి?

పరవాడ: మండలంలోని భర్నికం గ్రామానికి చెందిన బలిరెడ్డి సూర్య లక్ష్మీనారాయణ(32) చెరువులో చేపల వేటకు దిగి నీటిలో మునిగిపోయి మృతి చెందినట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు చెప్పారు. గ్రామ సమీపంలోని పెద్ద చెరువులో స్నేహితులతో కలిసి లక్ష్మీనారాయణ ఆదివారం మధ్యాహ్నం చేపల పట్టడానికి చెరువులో దిగాడు. చేపల వేట సాగిస్తూ నీటిలో మునిగిపోయి ఎంతకి రాకపోవడంతో తోటి స్నేహితులు పరవాడ పోలీసులకు, బంధువులకు సమాచారం అందించారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ముమ్మరంగా గాలింపు చేపట్టినా రాత్రి వరకు మృతదేహం లభ్యం కాలేదు. సోమవారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు సీఐ మల్లికార్జునరావు చెప్పారు. గాలింపు చర్యల్లో పరవాడ ఎస్ఐ మహాలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.


సూర్య లక్ష్మీనారాయణ(ఫైల్)